జిట్టా బాలకృష్ణారెడ్డికి పరామర్శ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 16 : హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

జిట్టా బాలకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

తూకంలో మోసం చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోండి

● కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి

కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 16 : ధాన్యం తూకంలో మోసం చేస్తున్న రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు. ఈ సదర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని రైస్ మిల్ యజమానులు, వ్యాపారులు ప్రభుత్వ నిర్ణయించిన ధరకు ధాన్యం కొనుగోలు చేయకుండా తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు పండించిన ధాన్యాన్ని బి-గ్రేడ్ ధాన్యం కింద కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోలు చేసినప్పుడు తూకంలో 40 కిలోల 600 గ్రాములకు బదులుగా 41 కిలోలు తూకం వేసి రైతులకు నష్టం కలిగిస్తున్నారని, మంచి ధాన్యాన్ని కూడా తాలు ధాన్యం అని చెప్పి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతులు మోసపోకుండా పర్యవేక్షిస్తూ రైస్‌మిల్లర్లు, వ్యాపారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సీతారాముల కల్యాణోత్సవాలు ప్రారంభం

ఆత్మకూరు(ఎం) : సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

చౌటుప్పల్, ఏప్రిల్ 16 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనం, దీక్షాధారణ, ధ్వజారోహణం, దేవతాహ్వానం, అఖండ దీపారాధన, మూలవర్యులకు అభిషేకం, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. నవమి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఆలయ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, కామిశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముందస్తుగా రాములోరి కల్యాణం

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని అంగడి ప్రదేశంలో నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి వేడుకలను ఒక రోజు ముందుగానే జరుపుకొంటారు. వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు తుమ్మల నర్సిరెడ్డి, మురళీధర్‌రెడ్డితోపాటు మాజీ సర్పంచ్‌లు నగేశ్, లక్ష్మారెడ్డి, రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుండెగోని ఐలయ్యగౌడ్, రాజిరెడ్డి, భాస్కర్, మల్లేశం, కాశీనాథ్, శంకర్ పాల్గొన్నారు.

స్వర్ణగిరి టెంపుల్ బైపాస్ వద్ద పోలీసులను ఏర్పాటు చేయాలి

● బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్య ంలో డీసీపీ రాజేశ్‌చంద్రకు వినతి


డీసీపీ రాజేశ్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 16 : భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి టెంపుల్, ఎల్లమ్మ ఆలయం సమీపంలో బైపాస్ వద్ద ప్రజలు రోడ్డు క్రాస్ చేసేటప్పుడు ప్రమాదానికి గురవుతున్నందున పోలీసులను ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో డీసీపీ కార్యాలయంలో మంగళవారం డీసీపీ రాజేశ్‌చంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. సెలవు రోజుల్లో దేవాలయాల దర్శనానికి అధిక జనం వస్తున్నారని, ఈ క్రమంలో బైపాస్ దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ప్రమాదం కలుగకుండా చూడాలని కోరారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండెబోయిన సురేశ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోటేశ్వరి, నాయకులు సురేశ్, గుండెబోయిన శంకర్ పాల్గొన్నారు.

అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సయ్య

మోత్కూరు, ఏప్రిల్16 : అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్య ఉత్తర్వులు అందజేసినట్లు మండలంలోని దాచారం గ్రామానికి చెందిన బందారపు నర్సయ్య తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గౌడ సంఘం కార్యాలయంలో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నర్సాపురం అంగన్‌వాడీ వార్షికోత్సవం

వలిగొండ, ఏప్రిల్16 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ వాణిశ్రీ సూచించారు. మంగళవారం మండలంలోని నర్సాపురం అంగన్‌వాడీ వార్షికోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలోని చిన్నారుల మూడు నెలల అసైన్‌మెంట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా స్టార్స్ కేటాయించి ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సక్కుబాయి, ఆయా నర్సమ్మ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

గుట్ట ఆలయ ఉద్యోగి అనుమానాస్పద మృతి

యాదగిరిగుట్ట, ఏప్రిల్16 : అనుమానాస్పద స్థితిలో యాదగిరిగుట్ట ఆలయ ఉద్యోగి మృతి చెందాడు. యాదగిరిగుట్ట సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గ్యాదపాక బాలనర్సింహ(38) సోమవారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం తెల్లవారుజామున నిద్ర లేవకపోవడంతో కుటుంబ సభ్యులు పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వెల్లడించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యాదగిరీశుడికి సుప్రభాత సేవ

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సుప్రభాత సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. సుదర్శన నారసింహోమం, నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా సాగింది. ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.12,38,002 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు నిత్యారాధనల అనంతరం సీతారామ హనుమత్ మూర్తులకు సహస్రనామార్చనలు చేశారు. నేడు మధ్యాహ్నం 12 గంటలకు సీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ భాస్కర్‌శర్మ, ఏఈఓలు, పర్యవేక్షకులు, అర్చకులు పాల్గొన్నారు.

మడి మడికి వరుస తడులు

రాజాపేటలో పంట పొలానికి వరుస తడులు పెట్టేందుకు పైపు లాగుతున్న రైతు సిద్ధులు

మరో రెండు తడులతో చేతికందే దశలో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు రైతన్న నానాకష్టాలు పడుతున్నాడు. రాజాపేట మండల కేంద్రానికి చెందిన రైతు రేగు సిద్ధులు తనకు ఉన్న రెండు బోర్లు, వ్యవసాయ బావి కింద మూడెకరాల పొలం సాగు చేశాడు. చెరువులు, కుంటలు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటడంతో బావితో పాటు ఓ బోరు కూడా ఎండిపోయింది. దాంతో మూడెకరాల్లో ఎకరం పూర్తిగా ఎండిపోయింది. మిగిలిన రెండెకరాల వరి పంటను కాపడుకునేందుకు రైతు పొద్దస్తమానం వ్యవసాయ బావి వద్దే ఉండి మడి మడికి వరుస తడులు అందించేందుకు మంగళవారం ఇలా పైపులైన్ వేసుకుంటూ కనిపించాడు.

- రాజాపేట, ఏప్రిల్ 16

కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి : డీఆర్‌డీఓ

నాగిరెడ్డిపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 16 : ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలించి మాట్లాడారు. కూలీలకు పని దినాలు కల్పించాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆయన వెంట ఏపీఓ బాలస్వామి, కార్యదర్శి పద్మారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ శేఖర్, ఎఫ్‌ఏ కౌసల్య ఉన్నారు .

మండలాల వారీగా బీఆర్‌ఎస్ సమావేశాలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 16 : ఎంపీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, పార్టీ సమావేశాలు, నిర్వహించే కార్యాక్రమాలను పార్టీ విడుదల చేసింది. ఈ నెల 20న భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, ఆత్మకూర్(ఎం), 21న బొమ్మలరామారం, గుండాల, మోత్కూర్‌లో సమావేశాలు నిర్వహించనున్నారు. 22న పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్ భువనగిరిలో నామినేషన్ వేయనున్నారు. 26న సంస్థాన్‌నారాయణపురం, 27న తుర్కపల్లి, ఆలేరు, 28న రాజాపేట, మోటకొండూర్, అడ్డగూడూర్, 29న బీబీనగర్, యాదగిరిగుట్ట, మే 2న రామన్నపేట, చౌటుప్పల్, మే 5న భువనగిరిలో బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత సమావేశాలు నిర్వహించనున్నది. సమావేశాల్లో పార్టీ అభ్యర్థి మల్లేశ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షుడు, నాయకులు పాల్గొననున్నారు.

ఎన్నికల వేళ జర భద్రం

● సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై జాగ్రత్త

హుజూర్‌నగర్, ఏప్రిల్ 16 : చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది కదా ఇంకేముంది... ఇష్టం వచ్చినట్లుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడతామని అనుకుంటున్నారా..! అయితే మీరు చిక్కుల్లో పడక తప్పదు. మత, రాజకీయ, వ్యక్తి గత అంశాలకు సంబంధించి ఇతరుల మనోభావాలు దెబ్బ తీసేలా వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పోస్టులు పెట్టినా కేసులను ఎదుర్కోవాల్సిందే. జైలు ఊచలు లెక్క పెట్టాల్సిందే. సాధారణ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల వేళ ప్రత్యర్థి పార్టీల నాయకులు, అభ్యర్థులు పరస్పరం తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకునే అవకాశం ఉంది. ఆయా పార్టీల్లో సామాజిక మాధ్యమాలకు(సోషల్ మీడియా) సంబంధించిన ప్రత్యేక విభాగాలున్నాయి.

అడ్మిన్లదే పూర్తి బాధ్యత

- సామాజిక మాధ్యమ గ్రూపుల్లో ముఖ్యంగా వాట్సాప్‌లో అభ్యంతరకర, విద్వేషాలను రెచ్చగొట్టేలా గ్రూప్‌లోని సభ్యులు పోస్టులు పెట్టినా అడ్మినే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిని గ్రూపు నుంచి తొలగించడంతోపాటు సదరు పోస్టును సైతం వెంటనే తొలగించాలి.
- గతంలో కేవలం పోస్టు చేసిన వారు మాత్రమే దాన్ని తొలగించే అవకాశముండగా ప్రస్తుతం గ్రూపులోని ఏ సభ్యుడు పెట్టిన పోస్టు అయినా అడ్మిన్ తొలగించే వీలుంది.
- గ్రూపులో కొత్త సభ్యులను చేర్చుకునే ముందు వారి అనుమతి తీసుకోవడంతో పాటు తప్పుడు పోస్టులు పెట్టిన వారిని తొలగించి పోలీసులకు సమాచారం అందించాల్సిన బాధ్యత కూడా అడ్మిన్‌కే ఉంటుంది.
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే తప్పుడు పోస్టులపై ఎవరూ ఫిర్యాదు చేయక పోయినా పోలీసులు సుమోటోగా కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.
- ఎన్నికల వేడి రాజుకుంటున్న నేపథ్యంలో ప్రత్యర్థులను అవమాన పరిచేలా, తమ అభ్యర్థి గొప్పతనాన్ని వివరిస్తూ పోస్టులు పెట్టే అవకాశం ఉంది.
- ప్రత్యర్థులను కించపరిచే వ్యాఖ్యలు , వ్యక్తిగత దూషణలు, ఫొటోల మార్ఫింగ్, వాయిస్ మెసేజ్‌లు, వాస్తవ విరుద్ధంగా పోస్టులు పెట్టినా, వాటిని షేర్ చేసినా, వాటికి మద్దతు తెలుపుతూ కామెంట్లు చేసినా చట్టరీత్యా శిక్షలు తప్పవు.
- తమ అనుమతి లేకుండా గ్రూపులో చేర్చు కునే అవకాశం లేకుండా వాట్సాప్‌లో ప్రత్యేక ఆప్షన్‌ను సెల్‌ఫోన్ వినియోగదారులు ఎంచుకోవడం ఉత్తమం.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగా రాజు

లావుడియా రాజు

బొమ్మలరామారం, ఏప్రిల్16 : మండలంలోని కాండ్లకుంటతండాకు చెందిన లావుడియా రాజునాయక్ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగా నియామకంపై ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ధీరావత్ జగన్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి మార్గదర్శకత్వంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ సభ్యులు రాజశేఖర్, శివ, రాజు, గణేశ్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ


రాజాపేటలోని ఫర్టిలైజర్ షాపులో స్టాక్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏడీఏ పద్మావతి

రాజాపేట, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను మంగళవారం యాదగిరిగుట్ట ఏడీఏ పద్మావతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఏఈఓలు వినీత, అంజయ్య, ప్రణిత, భవ్య ఉన్నారు.

బీజేపీ మ్యానిఫెస్టోలో బీసీల డిమాండ్ల ఊసే లేదు

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్

రాజాపేట, ఏప్రిల్ 16 : బీజేపీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో బీసీల డిమాండ్ల ఊసే లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ అన్నారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 60 శాతం ఉన్న బీసీలను బీజేపీ గుర్తించకపోవడం బాధాకరమన్నారు. బీసీల సమగ్రాభివృద్ధికి సంబంధించిన అంశాలు మ్యానిఫెస్టోలో చేర్చకపోవడం చూస్తుంటే బీసీలను అణచివేయాలనే కుట్రలకు ఆజ్యం పోస్తుందన్నారు. బీసీలను విస్మరించే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

దిలావర్‌పూర్‌లో చోరీ

మోటకొండూర్, ఏప్రిల్ 16 : మండలంలోని దిలావర్‌పూర్‌లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాటికాయల అనిత రోజు మాదిరిగానే కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి బయట పడుకుంది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తుతెలియని దుండగుడు అనిత మెడలోని పుస్తెలతాడును లాక్కెళ్లాడు. ఇది రోల్డ్ గోల్డ్ కావడంతో బాధితురాలు ఊపిరి పీల్చుకుంది. ఈ విషయంపై పోలీసులకు తెలియజేయగా.. వారు సుమారు రెండు గంటలపాటు దొంగను గాలించారు. వరుసు దొంగతనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామగ్రామాన జాగ్రత్తలు పాటించాలని, ప్రజలు ఇండ్లల్లోనే నిద్రించాలని పోలీసులు సూచిస్తున్నారు.

దొంగకు దేహశుద్ధి

భువనగిరి కలెక్టరేట్ : పట్టపగలే చోరీకి పాల్పడిన దొంగను గ్రామస్తులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన పట్టణ పరిధిలోని రాయగిరిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బట్టు రాజు ఇంటికి తాళ వేసి ఉండటాన్ని గమనించిన దుండగుడు మధ్యాహ్న సమయంలో ఎవరూ లేరని నిర్ధారించుకుని తాళాన్ని పగులగొట్టి ఇంట్లో చొరబడి దొరికన నగదును తీసుకొని మరో ఇంటి తాళాలు పగులగొట్టేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు గమనించి పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి భువనగిరి పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన వ్యక్తిగా చెబుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కురుమలు అన్ని రంగాల్లో రాణించాలి

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

కురుమ సంఘం రాజాపేట మండల కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రాజాపేట, ఏప్రిల్ 16 : కురుమలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఇటీవల రాజాపేట మండల కుర్మ సంఘం మండలాధ్యక్షుడిగా ఎంపికైన వస్పరి సుధాకర్‌ను మంగళవారం యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్, కురుమ సంఘం నాయకులు మహిపాల్, నర్సయ్య, కరుణాకర్, వీరయ్య, పాండు, శ్రీను, లింగయ్య, భాస్కర్, శ్రీను, ఉపేందర్ పాల్గొన్నారు.

క్యామ మల్లేశం గెలుపు ఖాయం

● బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కోరె భిక్షపతి

ఆత్మకూరు(ఎం) : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు భిక్షపతి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 16 : భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు కోరె భిక్షపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మర్చిపోయిందని, నేడు ప్రజలంతా బీఆర్‌ఎస్‌ను ఆదరించబోతున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన క్యామ మల్లేశాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత హామీలపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు బీసు చందర్‌గౌడ్, కోరె వెంకన్న, గడ్డం దశరథగౌడ్, ఎండీ అజీమొద్దీన్, సోలిపురం ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు. .

మతోన్మాద బీజేపీకి గుణపాఠం చెప్పాలి

● ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 16 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీకి గుణపాఠం చెప్పాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మహిళలకు పిలుపునిచ్చారు. మంగళవారం దుంపల మల్లారెడ్డి భవనంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద పేదవారికి ఇండ్లు కట్టిస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, కార్మికుల హక్కులను కాపాడుతామని, స్విస్ బ్యాంకులో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి పేదవారి ఖాతాలో రూ.15 లక్షల చొప్పన వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. మహిళలపై లైంగిక వేధింపులు, దళితులు, గిరిజనులపై దాడులు, అభ్యుదయ వాదులు, పౌర హక్కులపై దాడి చేస్తున్న బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీకి ఓటుతోనే బుద్ధి చెప్పాలని సూచించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సీపీఎం అభ్యర్థిగా జహంగీర్ ఏప్రిల్ 19న నిర్వహించే నామినేషన్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ, ఉపాధ్యక్షురాలు దోనూరు నిర్మల, కోశాధికారి కల్లూరి నాగమణి, బత్తుల జయమ్మ, దయ్యాల లక్ష్మి, మాయ రాణి, దయ్యాల ఉమ, లావణ్య పాల్గొన్నారు.

సీఎం రేవంత్ మాటలను నమ్మే పరిస్థితి లేదు

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవేందర్‌మాదిగ


ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్‌మాదిగ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 16 : సీఎం రేవంత్‌రెడ్డి మాటలను మాదిగలు నమ్మే పరిస్థితి చేయి దాటిపోయిందని, మాదిగలకు సమాధానం చెప్పలేక సీఎం అబద్ధాలు చెప్తున్నాడని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ అన్నారు. మంగళవారం భువనగిరిలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ప్రజల ముందు అబద్ధాలు చెప్పడం సరికాదన్నారు. పార్లమెంట్‌కు వెళ్లేందుకు మాదిగలకు అవకాశం ఇవ్వనోళ్లు వర్గీకరణ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా ఎస్సీ వర్గీకరణ చేస్తామంటే నమ్మడానికి మాదిగలు సిద్ధంగా లేరన్నారు. మాదిగలను కాంగ్రెస్ నుంచి దూరం చేసిన చరిత్ర రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 3 ఎస్సీ రిజర్వుడు ఎంపీ స్థానాలు, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాల్లో ఒక్క టికెట్ కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. మాదిగలను మభ్య పెట్టేందుకు సీఎం అబద్ధాలు ఆడుతున్నాడని, ఆయనన మాటలను నమ్మే ప్రసక్తే లేదన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వహణలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని వినతి

త్రిపురారం, ఏప్రిల్ 16 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నిర్వహణ, నియామకాల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని బొర్రాయిపాలెం గ్రామ యువకులు మంగళవారం డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డికి వినతిపత్రం అందచేశారు. గ్రామంలో రెండు సంఘబంధాలు ఉన్నాయని, ఆ సంఘబంధాలు 2022లో ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారని, మొదటి సంఘబంధం అధ్యక్షురాలిగా బచ్చలకూరి పూజిత, రెండో సంఘబంధం అధ్యక్షురాలిగా కొండేటి జయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, ఆదర్శ కమిటీలు వచ్చిన తరువాత ఏపీఎం, సీసీలు జయమ్మ పేరును మొండికత్తి జయమ్మ పేరుగా ఫోర్జరీ చేసి ఆదర్శ కమిటీ చైర్మన్‌గా పేరు పంపించారని కొందరు వ్యక్తులు వారి స్వలాభం కోసం పేర్లు మారుస్తున్నారని పేర్కొన్నారు. ఇంతకుముందు సంఘబంధానికి సంబంధించి రూ.60 వేలు డబ్బులు డ్రా చేశారని ఈ ఏపీఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.

ఆర్థిక సాయం

మునుగోడు, ఏప్రిల్ 16 : మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త నందిపాటి గోపాల్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ రూ.10,000 పంపగా బీఆర్‌ఎస్ మునుగోడు మండల ఉపాధ్యక్షుడు మందుల సత్యం సహకారంతో కిష్టాపురం బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ సభ్యుల ద్వారా మంగళవా రం ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు.